క్లుప్తంగా

అవినీతిని నిరూపిస్తే ఆస్తి రాసిస్తా

ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సవాల్



పిడుగురాళ్ల: అవినీతికి పాల్పడ్డానని నిరూపిస్తే తన ఆస్తిని రాసిస్తానని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి సవాల్ విసిరారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లాలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. టీడీపీ నేత యరపతినేని శ్రీనివాసరావు తనపై అవినీతి ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అధికారంలో ఉన్న సమయంలో అవినీతితో ఇల్లు నిర్మించుకున్న యరపతినేని అక్రమాలు ప్రజలందరికీ తెలుసని పేర్కొన్నారు. చిల్లర రాజకీయాలు చేయడం సమంజసం కాదని ధ్వజమెత్తారు. కాసు కుటుంబం అవినీతి సొమ్ముతో ఆస్తులు ఎప్పుడూ కూడబెట్టుకోబోదని స్పష్టం చేశారు. ఇప్పటికీ కాసు కృష్ణారెడ్డి హైదరాబాద్‌లో అద్దె భవనంలో ఉంటున్నారని గుర్తుచేశారు. ఇది తమ నిజాయితీ అని అన్నారు. తాము కష్టపడి వ్యాపారం చేస్తూ సంపాదించుకుంటున్నామని, 2019లో తాను ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ఎక్కడైనా సెంటు భూమి కొన్నట్టు నిరూపిస్తే తన ఆస్తి రాసిస్తానని యరపతినేనికి కాసు సవాల్ విసిరారు. పెద్దలు కాసు బ్రహ్మానందరెడ్డి, వెంగళరెడ్డి, వై.ఎస్.రాజశేఖరరెడ్డిలను ఆదర్శంగా తీసుకుని రాజకీయాల్లోకి వచ్చినట్టు చెప్పారు. ట్రస్టు ద్వారా తమ ఆధ్వర్యంలో విద్యాసంస్థలు నడుస్తున్నాయని, ప్రభుత్వ ఫీజులతోనే విద్యనందించేందుకు ప్రణాళిక రూపొందించామని పేర్కొన్నారు. కళాశాలల ఆస్తుల్లో తమకు గజం స్థలం కూడా రాదని స్పష్టం చేశారు. దీనిపై యరపతినేని ఎవరితోనైనా విచారణ చేయించుకోవచ్చని పేర్కొన్నారు.

అన్నదానం



మాచర్ల: పట్టణంలోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో డాక్టర్ రంగమ్మ హాస్పిటల్ అధినేత, వైద్యులు దశరథ్, సౌమ్య 9వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా పట్టణంలోని మానసిక వికలాంగులకు, లెప్రసీ కాలనీ వాసులకు మంగళవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ రామకోటయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వైద్యులు దశరథ్ మాట్లాడుతూ పేదలకు అన్నదానం నిర్వహించటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు మస్తాన్‌వలి, సత్యప్రసాద్, కోశాధికారి నాగార్జునరెడ్డి, ఏఎంఎస్ డైరెక్టర్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం

మాచవరం: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం వైఎస్సార్ సీపీ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల స్థాయిలో గ్రామ సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సింగరయ్య తెలిపారు. ముఖ్య అతిథిగా గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి హాజరవుతారని వివరించారు. సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథులు కార్యక్రమానికి తప్పకుండా హాజరు కావాలని కోరారు.

రేగులగడ్డలో గడప గడపకు మన ప్రభుత్వం

అనంతరం రేగులగడ్డ గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సింగరయ్య తెలిపారు. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చేతుల మీదుగా గ్రామంలో కొత్తగా నిర్మించిన పాఠశాల భవన ప్రారంభోత్సవం, వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహావిష్కరణ చేయనున్నట్లు వెల్లడించారు.

వెబ్‌సైట్‌లో నమోదు చేయండి

చిలకలూరిపేట: పరీక్షల అనంతరం తరగతి వారీగా విద్యార్థులకు వచ్చిన మార్కులను విద్యాశాఖ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని ఎంఈవో కె.లక్ష్మి ఆదేశించారు. పట్టణంలోని కేవీఆర్‌నగర్‌లో ఉన్న డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం రికార్డులు పరిశీలించారు. ఎఫ్ఏ 4 పరీక్షల తీరును పరిశీలించారు. తరగతి వారీగా రిజిస్టర్లు, రైస్ రిజిస్టర్, చిక్కీ రిజిస్టర్, ఎగ్ రిజిస్టర్, మధ్యాహ్నభోజన టేస్ట్ రిజిస్టర్లను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం నాణ్యత విషయం విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం కె.సుధా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శరవేగం

- దాదాపు పూర్తికావచ్చిన బైపాస్ పనులు
- రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులూ వేగంగా..
- రెండు జంక్షన్ల పనులు ముమ్మరంగా..
- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చొరవతో తీరనున్న ట్రాఫిక్ సమస్య



నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్ బ్రిడ్జి



దాదాపు పూర్తయిన బైపాస్ రోడ్డు

పిడుగురాళ్ల: ఏళ్ల తరబడి పిడుగురాళ్ల పట్టణానికి శాపంగా మారిన ట్రాఫిక్ సమస్య త్వరలోనే పరిష్కారం కానున్నది. బైపాస్ రోడ్డు పనులు దాదాపుగా పూర్తి కావచ్చాయి. బైపాస్ నిర్మాణంలో భాగంగా రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. ఇది పూర్తయితే బైపాస్ రోడ్డుపై నుంచే వాహనాల రాకపోకలు సాగనున్నాయి. గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చొరవ, కృషి వల్ల బైపాస్ పనులు ఆఖరి దశకు చేరాయి. గత టీడీపీ ప్రభుత్వంలో ఈ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కాంట్రాక్టర్లకు సహాయ సహకారాలు అందించి పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టారు. ఫలితంగా నిర్మాణం పూర్తి కావచ్చింది. రైల్వే ఓవర్ బ్రిడ్జికి, బైపాస్‌కు మధ్యన ఉన్న రోడ్డు పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి.

త్వరలోనే రైల్వే గడ్డర్ల ఏర్పాటు

రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం కూడా గడ్డర్లను ఏర్పాటు చేస్తే పూర్తవుతుంది. ఈ గడ్డర్ల పనులు రైల్వే శాఖ అధికారుల పర్యవేక్షణలో జరుగుతున్నాయి. ఇప్పటికే నామ్ ఎక్స్‌ప్రెస్ హైవే సిబ్బంది గడ్డర్ల నిర్మాణానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లూ చేశారు. త్వరలోనే ఈ గడ్డర్లను పిడుగురాళ్లకు తెచ్చి రైల్వే ఓవర్ బ్రిడ్జిపై ఏర్పాటు చేస్తే నిర్మాణం పూర్తవుతుంది.

చకచక రెండు జంక్షన్ల పనులు

బైపాస్ రోడ్డు నిర్మాణంలో భాగంగా రెండు జంక్షన్ల పనులు చకచక సాగుతున్నాయి. పట్టణ సమీపంలోని పాత ఖలీల్ దాబా వద్ద మొదటి జంక్షన్ పనులు జరుగుతున్నాయి. కొండమోడు సమీపంలో మరో జంక్షన్ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. ఈ పనులు కొన్ని రోజుల్లోనే పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. పిడుగురాళ్ల పాత ఖలీల్ దాబా నుంచి మొదలై కొండమోడు సమీపంలోని జంక్షన్ వద్ద బైపాస్ ముగుస్తుంది. ఈ పనులు పూర్తయితే పట్టణంలోని ట్రాఫిక్ సమస్య పరిష్కారమవుతుంది.

> **అనుకున్న సమయానికే పూర్తి చేస్తాం**
>
> పిడుగురాళ్ల బైపాస్ నిర్మాణంలో భాగంగా రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు జరుగుతున్నాయి. ఇప్పటికే నామ్ సిబ్బంది పనులను చేస్తున్నారు. అనుకున్న సమయంలోగానే పనుల పూర్తికి తగిన చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చారు. సమయానికే పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం.
>
> – సమర్పణరావు, ఆర్‌అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గుంటూరు

నులిపురుగులను నివారిద్దాం



మాచర్లలో విద్యార్థికి ఆల్బెండజోల్ మాత్రను వేస్తున్న దృశ్యం



దాచేపల్లిలో..



దుర్గిలో..



గురజాలలోని అంగన్‌వాడీ కేంద్రంలో..



రెంటచింతలలో..

మాచర్ల/దాచేపల్లి/గురజాల/దుర్గి/రెంటచింతల: పట్టణంలోని వివిధ పాఠశాలల్లో మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబు ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. మధ్యాహ్నం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం అరుణ, సచివాలయ నర్సు కుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో 500 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు అందించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాయ సంఘ నాయకులు గంగాధర్ పాల్గొన్నారు. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం ఐవీ నాగమణి ఆధ్వర్యంలో, నెహ్రూనగర్‌లో కిరీటిరెడ్డి, వివిధ పాఠశాలలో ఆయా హెచ్‌ఎంల ఆధ్వర్యంలో మాత్రలు అందించారు.

- దాచేపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యార్థులకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలను నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.శైలజ, స్థానిక నాయకులు కొమ్ము బుజ్జి, శ్రీరాములు, నడికుడి సూర్రెడ్డి పాల్గొన్నారు.
- గురజాల మండలంలో 14,060 మంది విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసినట్టు మాడుగుల వైద్యురాలు పద్మావతి చెప్పారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో మంగళవారం మాత్రల పంపిణీ జరిగింది.
- దుర్గి మండలంలోని అన్ని పాఠశాలల్లో మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. దుర్గి జెడ్పీ హైస్కూల్లో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద, ఎంపీపీ యేచూరి సాయి శంకర్, ఎంపీడీఓ షేక్ గౌసియా బేగం, ఎస్‌ఎంసీ చైర్మన్ తోటకూర వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.
- రెంటచింతల సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాలలో ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, తహసీల్దార్ కట్టేకోట పుల్లారావు, ఎంఈఓ ఐ.వెంకటేశ్వర్లు విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ నర్రా కృష్ణారెడ్డి, ఈవోపీఆర్డీ రామచంద్రరావు పాల్గొన్నారు.

అర్హులందరికీ నవరత్నాలు అందాలి



కంభంపాడు గ్రామంలో సచివాలయ రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కోటేశ్వరరావు

మాచర్ల రూరల్: సచివాలయ ఉద్యోగులు ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని నిర్ణీత సమయంలో పరిష్కరించటమే కాకుండా సమయపాలన కచ్చితంగా పాటించాలని ఎంపీడీఓ కోటేశ్వరరావు సూచించారు. మంగళవారం మండలంలోని కంభంపాడు గ్రామంలో సచివాలయ రికార్డులను పరిశీలించి ఆయన మాట్లాడారు. ఉద్యోగులకు ప్రభుత్వం అందిస్తున్న యూనిఫాం ధరించాలన్నారు. అర్హత గల ప్రతి ఒక్కరికీ జగనన్న నవరత్నాల పథకాలు అందజేయటంలో ముఖ్య పాత్ర పోషించాలని సూచించారు. అనంతరం రైతు భరోసా కేంద్రాన్ని, సచివాలయ హాజరు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బిట్టు వెంకటేశ్వర్లు, వీఆర్వో ఆరుముళ్ళ నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది లక్ష్మానాయక్, అశోక్‌కుమార్, దొంగరి అనురాధ, భవాని తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా జగనన్న స్వచ్ఛసంకల్పం

జిల్లా పంచాయతీ అధికారి మల్లావరపు విజయ్‌భాస్కర్‌రెడ్డి



మాట్లాడుతున్న విజయ్‌భాస్కర్‌రెడ్డి

శావల్యాపురం: జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమాన్ని పారదర్శకంగా అమలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి మల్లావరపు విజయ్ భాస్కర్‌రెడ్డి చెప్పారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంటి పన్నులు వసూలు, జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమం నిర్వహణ అమలు తీరుపై మండల స్థాయిలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా పంచాయతీ అధికారి మాట్లాడుతూ జిల్లా కలెక్టరు ఆదేశాల మేరకు ప్రతి గ్రామ పంచాయతీలో శానిటేషన్ సిబ్బంది సేకరించిన తడి, పొడి చెత్తను రోడ్లపై వేయకుండా తప్పనిసరిగా ఘన వ్యర్థాల కేంద్రాలకు తరలించాలని, శానిటేషన్ సిబ్బంది వేతనాలు సకాలంలో అందేలా పంచాయతీ కార్యదర్శులపై బాధ్యత వహించాలన్నారు. శావల్యాపురంలో జాతీయ రహదారి మార్గం వెంబడి చెత్తా చెదారం సత్వరమే తొలగించాలన్నారు. త్వరలో అన్నీ గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు పోస్టులు భర్తీకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఇక నుంచి గ్రామ పంచాయతీల్లో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల పర్యవేక్షణలో రక్షిత మంచినీటి పథకం ఫిల్టర్ బెడ్స్‌లో ఇసుక మరమ్మతులకు చేపడుతున్నట్లు చెప్పారు.

జిల్లాలో ఇంటి పన్నులు వసూలు 56.47 శాతం ఉందని ఈనెలాఖరులోగా 80 శాతం అయ్యేలా క్షేత్రస్థాయిలో చర్యలు చేపట్టామన్నారు. శావల్యాపురం మండలంలో 52 శాతం ఇంటి పన్నులు వసూలు చేసినట్లు చెప్పారు. పల్నాడు జిల్లాలో ఇంటి పన్నులు వసూలు చేయడంలో చివరి దశలో అచ్చంపేట మండలం ఉందన్నారు. అనంతరం శావల్యాపురంలో ఘన వ్యర్థాల కేంద్రం నిర్వహణ తీరును పరిశీలించి పురోగతిలో ఉండేలా చూడాలన్నారు. చెత్తా సంపద కేంద్రాల ద్వారా పంచాయతీలకు ఆదాయ మార్గాలు పెంపుదల చేయాలన్నారు. ఆయనతో పాటు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య, ఈవోపీఆర్‌డి పి.సుగుణ, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

పంట ఏదైనా ఈక్రాప్ తప్పనిసరి



సాతులూరు ఆర్‌బీకేలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి మురళి తదితరులు

నాదెండ్ల: రైతులు ఏ పంటను పండించినా ఈక్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయించుకుని ప్రభుత్వం అందించే ప్రయోజనాలు పొందాలని పల్నాడుజిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి చెప్పారు. పల్నాడు జిల్లా సాతులూరు గ్రామంలోని వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈక్రాప్ నమోదు సామాజిక తనిఖీ కోసం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రస్తుతం రబీ కాలంలో సాగు చేసిన పంటలను ఈక్రాప్ నమోదు అయ్యాయని, సామాజిక తనిఖీ కోసం నోటీసు బోర్డులో ఉంచినట్లు తెలిపారు. ఈక్రాప్ చేయించినట్లయితే ప్రభుత్వం అందించే మద్దతు ధరలతోపాటూ జాతీయ విపత్తుల్లో పంట నష్టపోయిన వారికి ఇన్‌పుట్ సబ్సిడీతో పాటూ రైతులకు పరికరాలు అందుతాయన్నారు. ఈ రబీలో గతేడాది కన్నా మొక్కజొన్న సాగు పెరిగిందని, శనగ పంట కూడా ఈ ఏడాది దిగుబడి ఆశాజనకంగా ఉన్నట్లు తెలిపారు. త్వరలో రైతు భరోసా కేంద్రాల ద్వారా శనగ కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్యాలయం ఏడీఏ రవికుమార్, నరసరావుపేట ఏడీఏ మస్తానమ్మ, మండల వ్యవసాయాధికారి హరిప్రసాద్, శనగల కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జి రవీంద్రబాబు, గ్రామ వ్యవసాయ సహాయకులు రామారావు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

కుంగ్‌ఫూలో గణపవరం విద్యార్థుల సత్తా

నాదెండ్ల: కుంగ్‌ఫూలో గణపవరం విద్యార్థులు సత్తా చాటడం అభినందనీయమని మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు చెప్పారు. గణపవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షణ పొందుతున్న 21 మంది విద్యార్థులు 24 మెడల్స్ సాధించారు. వీరిలో 13 బంగారు, 11 రజత, కాంస్య పతకాలు సాధించారు. ఈ నెల 12న చిలకలూరిపేట మోడరన్ కాంప్లెక్స్‌లో జవహర్‌లాల్ నెహ్రూ మెమోరియల్ ఇంటర్‌స్టేట్ ఇంటర్నేషనల్ కరాటే అండ్ కుంగ్‌ఫూ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న షణ్ముఖి, అక్షయ్, చైతన్యరెడ్డి, వైష్ణవ్‌రెడ్డి, భవాని, భృగుణేశ్, సాయిశరణ్, ధర్మతేజ, ప్రశాంత్‌రాజ్‌లు బంగారు పతకాలు సాధించగా, బాలమణికంఠ, శ్రీవిద్య, కీర్తి, అక్స, కుశలసాయి, లోకేష్, హుస్సేన్, నసీమ రజత పతకాలు సాధించారు.

25 ఏళ్లలో చేయలేనిది 25 రోజుల్లోనే చేశాం

- ఇదీ మా నిబద్ధత
- ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి
- 500 మంది పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ



మహిళకు పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: గత 25 ఏళ్లల్లో ఏ రాజకీయ నాయకుడూ చేయలేని పట్టాల పంపిణీని తమ ప్రభుత్వంలో కేవలం 25 రోజుల్లోనే చేసి చూపించామని గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చెప్పారు. పట్టణంలోని 32, 33 వార్డుల్లోని లెనిన్ నగర్, మారుతీనగర్ వాసులకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం మంగళవారం స్థానిక ప్రభుత్వ పాఠశాలలో జరిగింది. ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు పట్టాలు అందించారు. అనంతరం మాట్లాడుతూ గత ప్రభుత్వాలకు ఇక్కడ ఉన్న పేద ప్రజలందరూ తాము నివసిస్తున్న గృహాలకు హక్కు పట్టాలు ఇవ్వాలని విన్నవించినా ఎవరూ స్పందించలేదని చెప్పారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వారి సమస్యను 25 రోజుల్లోనే పరిష్కరించామని సగర్వంగా ప్రకటించారు. గత నెలలో ఈప్రాంతంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించినప్పుడు స్థానికులు హక్కు పత్రాలు ఇవ్వాలని కోరారని, దీనిపై స్పందించి వెంటనే స్థానిక తహసీల్దారు చక్రవర్తికి ఆదేశాలిచ్చామని, 25 రోజుల్లోనే 500 మందికి పట్టాలు అందించడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. మరో 300 మందికి కూడా సర్వే నిర్వహించి త్వరలోనే హక్కు పత్రాలు అందజేస్తామని వెల్లడించారు. స్థానిక హైస్కూల్‌కు రూ.2 కోట్లతో పాఠశాల భవనం నిర్మిస్తున్నట్టు వివరించారు. అర్బన్ హెల్త్ సెంటర్ భవనం నిర్మాణం కూడా జరుగుతోందన్నారు. ఇప్పటికే పట్టణంలోని లెనిన్‌నగర్, మారుతీనగర్ ప్రజలకు తాగునీరు అందించామని స్పష్టం చేశారు. పేదల అభివృద్ధి కోసం వైఎస్సార్ సీపీ అహర్నిశలు కృషి చేస్తోందన్నారు. అనంతరం 500 మంది మహిళలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా పట్టాలు అందజేశారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ చింత వెంకటరామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ముక్కంటి, మార్కెట్ యార్డు చైర్మన్ కొమెర వెంకటేశ్వర్లు, మాజీ చైర్మన్ ఎండీ గఫార్, కౌన్సిలర్లు షేక్ సైదాబిజానీ, ఉప్పుదేవి వెంకటేశ్వర్లు, తహసీల్దారు చక్రవర్తి, మున్సిపల్ డీఈ సత్యనారాయణ, ముక్కంటి, శారద, పసుపులేటి ఆనంద్, నంద్యాల ఆంజనేయులు, కె.వాగ్గేయపురెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీసెల్ అధ్యక్షుడు కందులూరి శివయ్య, నాగరాజు పాల్గొన్నారు.

యాదవరాజులంతా పీఆర్కేకు అండగా నిలవాలి

మాజీ మంత్రి పార్థసారథి



తాళ్ళపల్లి గ్రామంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

మాచర్ల రూరల్: మాచర్ల నియోజకవర్గంలో యాదవరాజుల అభివృద్ధికి కృషి చేస్తున్న పిన్నెల్లి కుటుంబానికి అండగా ఉండాలని, రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి, పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి కోరారు. మండలంలోని తాళ్ళపల్లి గ్రామంలో సోమవారం రాత్రి శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి తిరునాళ్ళకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నియోజకవర్గంలో మార్కెట్ యార్డు చైర్మన్, ఎంపీపీ, జెడ్పీటీసీ, సొసైటీ చైర్మన్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ వంటి పదవులే కాకుండా ఆర్థికంగా యాదవుల ఉన్నతికి పాటుపడుతున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వెన్నంటి ఉండాలని పేర్కొన్నారు.

యాదవుల సంక్షేమం కోసం కృషి

ఇచ్చిన మాటకు కట్టుబడి నమ్మిన మనిషి కోసం కడదాకా నిలిచే యాదవుల సంక్షేమం కోసం మా పిన్నెల్లి కుటుంబం ఎప్పుడూ ముందుంటుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి చెప్పారు. పల్నాటి ప్రాంతంలో ప్రజలకు భక్తి భావం ఎక్కువని, ప్రశాంతంగా ఆధ్యాత్మిక వాతావరణంలో పండుగలు నిర్వహించుకోవటం శుభపరిణామమన్నారు.

కార్యక్రమంలో ఎంపీపీ బూడిద శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మండ్లి పెద మల్లుస్వామి, మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, సర్పంచ్ జూకూరి వెంకట్రామయ్య, ఉప సర్పంచ్ పసుపులేటి బ్రహ్మానాయుడు, ఏజీపీ జీవీ యాదవ్, మాజీ చైర్మన్ కె.కోటయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు యల్లాల బ్రహ్మయ్య యాదవ్, గుండా కృష్ణ, సంతోష్ యాదవ్, ముక్కా గురవయ్య, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ కటకం జయశ్రీ

దాచేపల్లి : అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, అధికారులు భాగస్వాములు కావాలని ఎంపీపీ కటకం జయశ్రీ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో ఆమె మంగళవారం సమావేశం నిర్వహించారు. మండల వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. ఎంపీపీ జయశ్రీ మాట్లాడుతూ ఏళ్ల తరబడి భూముల్లో సాగు చేస్తున్న రైతులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. జెడ్పీటీసీ సభ్యులు మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం తగదని హితవు పలికారు. వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు సచివాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండటంలేదని ఆరోపణలు వస్తున్నాయని, గ్రామ స్థాయి అధికారులు తప్పనిసరిగా ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్‌సత్తార్, సూపర్‌నెండెంట్ సాంబశివరావు, ఈవోపీఆర్డీ మాధవీలత తదితరులు పాల్గొన్నారు.